భీం నినాదం.. అమలుకు దూరం!

జల్..

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత వాసులకు కుమురం భీం జిల్లా ధనోరా ఇన్‌టేక్‌వెల్ నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. 220 గ్రామాలకు వైఎస్ ప్రభుత్వ హయాంలో పైప్‌లైన్ వేశారు. రూ.70 కోట్లు వెచ్చించారు. 2017-2020 వరకు పలుమార్లు మరమ్మతుల పేరుతో రూ.22 కోట్లు వెచ్చించారు. కుమురం భీం జలాశయంలోని ఇంటేక్‌వెల్‌లో (42 ఎంఎల్‌డీ-మిలియన్ లీటర్ పర్‌డే) చిన్నపాటి వర్షం వచ్చినా బురద పేరుకుంటుంది. ఇక్కడ మరో ఇన్‌టేక్‌వెల్, పైప్‌లైన్ మరమ్మతులకు ప్రభుత్వం మార్చిలో రూ.60 కోట్లు మంజూరు చేసినా.. పనులు ప్రారంభం కాలేదు. వందలాది గిరిజన గ్రామాల ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు.


కుమురం భీం జలాశయంలో ధనోరా ఇన్‌టేక్‌వెల్ వద్ద వర్షం వస్తే పేరుకుంటున్న బురద

జంగల్..

ఆదివాసీలు చేసుకునే ప్రతి పండగ అడవితో ముడిపడి ఉంటుంది. నాలుగు జిల్లాల పరిధిలో కవ్వాల్ పులుల అభయారణ్యం విస్తరించి ఉంది. కోర్, బఫర్ ఏరియాలతోపాటు, మైదాన ప్రాంతాల్లో పల్లెలు విస్తరించి ఉన్నాయి. పులుల కదలికల నేపథ్యంలో అటవీ అధికారులు తీవ్రమైన ఆంక్షలు పెడుతుండటంతో.. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కవ్వాల్ అటవీ ప్రాంతం:
- కోర్ ఏరియా: 822.23 చ.కి.మీ.
- బఫర్ ఏరియా: 1123.21 చ.కి.మీ.
- బఫర్ ఏరియాలో గ్రామాలు: 42

జమీన్..

మొదటి నుంచి గిరిజనుల జీవనాధారం పోడు వ్యవసాయం. 2008, 2023 లో పోడుదారులకు ప్రభుత్వాలు అటవీ హక్కు పత్రాలు అందజేసినా, ఇప్పటికీ రాని వారు ఉమ్మడి జిల్లాలో అనేకం. వీరందరూ రైతు భరోసా, బీమా పథకాలకు దూరమవుతున్నారు. కుటుంబ సభ్యులకు విరాసత్ సైతం కావడం లేదు. వెబ్‌సైట్‌లో పలు సాంకేతిక సమస్యలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

గిరిజనులకు ఇంకా అందాల్సిన పోడు పట్టాలు: 33,885
సాగు చేస్తున్న భూమి: 1.24 లక్షల ఎకరాలు





ఈనాడు, ఆసిఫాబాద్

జల్, జంగల్, జమీన్ నినాద సాధనే లక్ష్యంగా, ఆదివాసీల అభ్యున్నతే ధ్యేయంగా ప్రాణాలను త్యజించిన పోరాట యోధుడు కుమురం భీం 84వ వర్ధంతికి పోరాటాల పురిటిగడ్డ జోడేఘాట్ సన్నద్ధమైంది. 'మావనాటే మావరాజ్' (మా ఊరిలో మా రాజ్య స్థాపనే) ధ్యేయంగా భీం 12 గ్రామాలను ఒక్కటి చేసి తుడుం మోగించారు. వీటినే పోరు గ్రామాలుగా పిలుస్తారు. భీం ప్రాణత్యాగంతో కొంత మేరకు ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆయన లక్ష్యం ఇప్పటికీ దూరంగానే ఉంది.

పోరు గ్రామాల అవస్థలు..

కెరమెరి మండలంలోని టోకెన్‌మోవాడ్, లైన్‌పటార్, బాబేఝరి, శివగూడ, పిట్టగూడ, కల్లెగాం, పట్నాపూర్, చాల్‌బడి, పాటగూడ, చిన్న పట్నాపూర్, గోండుగూడ, కొపగూడలు.. పోరు గ్రామాలుగా కాగా వీటి పరిధిలో 2800 వరకు జనాభా ఉంది. లైన్‌పటార్, పిట్టగూడ గ్రామాలకు ఇప్పటికీ రహదారి సౌకర్యం లేదు. చాల్‌బడి, పాటగూడది ఇదే పరిస్థితి. శివగూడ, పిట్టగూడ ప్రజలకు నిత్యం, వేసవి వచ్చిందంటే మిగతా గ్రామవాసులకు తాగునీటికి చెలమలు లేదా వాగుల వద్దకు పరుగులు పెట్టాల్సిందే. నాలుగేళ్ల కిందట జోడేఘాట్‌లో 31 ఇళ్లు మంజూరు కాగా నేటికీ పూర్తి కాలేదు. హట్టి నుంచి జోడేఘాట్‌కు వెళ్లే మార్గంలో 8 కి.మీ. రోడ్డు అటవీ అనుమతులు లేక నిలిచిపోయాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో
- గిరిజన జనాభా: 4.95 లక్షలు
- గిరిజన మండలాలు: 38
- గ్రామాలు: 1758
- అనుబంధ గ్రామాలు: 3,859


లైన్‌పటార్‌కు వెళ్లే దారి రాళ్లతో నిండి..


శివగూడలో చెలమ నీటిని తీసుకుంటున్న ప్రజలు

రుణమాఫీ.. రైతుల హైరానా

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల వరకు పంట రుణం మాఫీ చేస్తామని ప్రభుత్వం మూడు విడతల్లో నిధులు మంజూరు చేసింది. కానీ పలు కారణాలతో చాలా మందికి మాఫీ కాలేదు. సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నా.. వాటిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. నిత్యం వ్యవసాయ, బ్యాంకులు, కలెక్టరేట్‌ల చుట్టూ తిరుగుతూ జిల్లాలో వేల మంది అన్నదాతలు హైరానా పడుతున్నారు.

జిల్లాలో రూ.2 లక్షల వరకు రుణమాఫీకి 48,556 మంది రైతులను అర్హులుగా తేల్చిన ప్రభుత్వం విడతల వారీగా నిధులు విడుదల చేసింది. అన్ని సవ్యంగా ఉన్న వారు మాఫీ డబ్బులు పొందినా.. వివిధ సమస్యలతో ఉన్న వారు ఎదురు చూస్తున్నారు. గతంలో ఉన్న బ్యాంకు ఖాతాలు మారడం, రద్దు కావడం, ఆధార్, బ్యాంకు ఖాతాల్లో తప్పులు దొర్లడం, గతంలో ఉన్న భూమి విక్రయించడంతో ప్రస్తుతం పట్టా లేకపోవడం, రేషన్ కార్డులో పేరు లేకపోవడం, కొందరు అప్పు తీసుకున్న రైతులు మృతి చెందడం.. ఇలా వివిధ కారణాలతో కొందరు మాఫీ డబ్బులు అందక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కాగా ఎంత మంది రైతులు ఇప్పటివరకు మాఫీ డబ్బులు పొందారన్న వివరాలు జిల్లా అధికారుల వద్ద అందుబాటులో లేవు.


కుటుంబ మ్యాపింగ్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవోలు

కొనసాగుతున్న కుటుంబ నిర్ధారణ

పంట రుణాలు పొంది రేషన్ కార్డు లేని కుటుంబాల మ్యాపింగ్‌ను వ్యవసాయ అధికారులు కొనసాగిస్తున్నారు. ఇందుకోసం 6,837 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు నాలుగు వేలకు పైగా ప్రత్యేక యాప్‌లో నమోదు చేసినట్లు తెలిసింది. కొందరు రైతులు విసిగిపోయి రాకపోవడంతో ఫోన్లు చేసి పిలిపిస్తున్నట్లు చెబుతున్నారు. ఇది వరకు రోజు వారీగా ఈ వివరాలను వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి డ్యాష్ బోర్డులో ప్రదర్శించే వారు. తద్వారా జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో వివరాలు తెలిసేవి. ప్రస్తుతం అవేమీ ప్రదర్శించడంలేదని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.


- ◆ జిల్లాలో మూడు విడతల్లో రుణమాఫీ అయిన రైతులు : 48,556
- ◆ మాఫీ సొమ్ము : రూ. 435.75 కోట్లు
- ◆ ఇప్పటి వరకు మాఫీ డబ్బులు జమైన రైతులు: 41,987
- ◆ జమ చేసిన సొమ్ము : రూ. 393.07 కోట్లు
- ◆ ఇంకా మాఫీ కావాల్సిన వారు : 6574
- ◆ జమ కావాల్సిన నిధులు : రూ. 42.38 కోట్లు
- ◆ రూ.2 లక్షలకు పైన రుణాలు పొందిన వారు : 1263
- ◆ ఆధార్ సమస్యలు, సమాచారం లేనివి : 412

మరి వీరి పరిస్థితి?

జిల్లాలో రూ.2 లక్షలకు పైన రుణం పొందిన వారు 1263 ఉన్నారు. వీరిలో కొందరు ఇప్పటికే రూ.2 లక్షలకు పైన ఉన్న రుణ డబ్బులను బ్యాంకులకు చెల్లించారు. కానీ ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో మదన పడుతున్నారు. ప్రైవేటులో అప్పు తెచ్చి చెల్లిస్తే.. మాఫీ అందక వడ్డీ భారం మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పు తెచ్చి బ్యాంకులో కట్టా

- సీహెచ్.కారు, ఎల్లారం



గ్రామ శివారులో అయిదెకరాల భూమి ఉంది. ఒక బ్యాంకులో రూ.80 వేలు, మరో బ్యాంకులో రూ.1.60 లక్షల రుణం తీసుకున్నా. వీటిలో రూ.54 వేలు అప్పు తెచ్చి ఓ బ్యాంకులో చెల్లించా. ఇంకా రెండింటిల్లో కలిపి రూ.1.86 లక్షల అప్పు ఉంది. మాఫీ డబ్బులు అందక ఇబ్బంది పడుతున్నా.

ఖర్చు స్వల్పం.. వినియోగం అంతంతమాత్రం!

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం


కూటి కోసం కోటి విద్యలు అన్నారు. ప్రపంచం మొత్తంలో ఎవరు ఏ పని చేసినా.. ఆకలి తీర్చుకోవడానికే.. తర్వాతే మిగిలినవన్నీ. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నామని చెప్పుకొంటున్నా అక్కడక్కడ ఆకలి కేకలు వినిపిస్తూనే ఉన్నాయి. కొన్ని చోట్ల విపరీతమైన ఆహారం వృథా అవుతూనే ఉంది. రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్‌లోనే ఆహారంపై అతి తక్కువగా ఖర్చు చేస్తున్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా ఆహార పరిస్థితులపై కథనం.

- ఉమ్మడి జిల్లాలో కూరగాయలు, పండ్ల వాడకం చాలా తక్కువ
- నేడు ప్రపంచ ఆహార దినోత్సవం

జిల్లాలో ఆహార పంటల్లో అత్యధికంగా వరితో పాటు పప్పుధాన్యాల సాగు ఉంటుంది. ఇతర జిల్లాలతో పోలిస్తే సోయా, కంది పంటల దిగుబడి ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతున్నా.. పేదరికం కారణంగా అనేక మంది పూట గడవడానికి కూలీ పనులు చేస్తూ పొట్ట నింపుకొంటున్నారు.

ఎందుకంటే?

ప్రపంచ ఆహార దినోత్సవం 1979లో ఏర్పాటు చేశారు. అక్టోబరు 16న ఐక్యరాజ్యసమితి, ఆహార, వ్యవసాయ సంస్థ(యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్‌కు సంబంధించిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్) స్థాపించారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా 150 కంటే ఎక్కువ దేశాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. ఏటా ఒక అంశం(థీమ్)పై అవగాహన కలిగిస్తారు. ఈ ఏడాది మెరుగైన జీవితం, మెరుగైన భవిష్యత్తు కోసం ఆహార హక్కును అంశంగా ప్రకటించారు.



ఉమ్మడి జిల్లాలో ఏటా పంటల ఉత్పత్తి (లక్షల టన్నుల్లో)	వరి	కందులు	పప్పుధాన్యాలు (చిరుధాన్యాలతో కలిపి)	కూరగాయలు
	5.25	9.60	5.35	24.35

పండ్లు	పాలు	చేపలు	మాంసం
2,842 టన్నులు	3.28 లక్షల లీటర్లు	38 వేల టన్నులు	43 వేల టన్నులు

భారీగా వృథా..

జిల్లాలో కొంత మంది అర్ధాకలితో అలమటిస్తుంటే.. పలు చోట్ల ఆహారం వృథా చేస్తున్నారు. ప్రధానంగా వివాహాలు, ఇతర వేడుకలతో పాటు హోటళ్లలో వృథా శాతం ఎక్కువగా ఉంటోంది. వృథా చేసే బదులు దాన్ని ఉపయోగంలోకి తీసుకొస్తే.. పేదలకు కొంత మేలు జరిగే వీలుంది. అవసరమైన సౌకర్యాలు లేక పండించిన పంటలలో కూరగాయలు, పండ్లు త్వరగా చెడిపోతున్నాయి. ఉత్పత్తి ఎక్కువగా ఉన్న సమయంలో నిల్వ చేసుకునే సదుపాయాలు లేక తక్కువ ధరకే ఇవ్వడం లేదా బయట పారేయాల్సిన పరిస్థితి ఉంటోంది. మన దేశంలో ఏటా వృథా అయ్యే కూరగాయలు, పండ్ల విలువ రూ.40 వేల కోట్లు ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు.

మీకు తెలుసా?

- ◆ ప్రపంచంలో ప్రతి ఒక్కరికి ఆహారం ఇవ్వడానికి అవసరమైన ఉత్పత్తి ఉన్నా.. తొమ్మిది మందిలో ఒకరు దీర్ఘకాలిక ఆకలితో బాధ పడుతున్నారు.
- ◆ ఆకలితో ఉన్న వారిలో 60 శాతం మంది మహిళలే..
- ◆ 45 శాతం మంది శిశు మరణాలు పోషకాహార లోపం కారణంగానే సంభవిస్తున్నాయి.
- ◆ భారత జనాభాలో పోషకాహార లోపంతో బాధ పడుతున్న వారు 14.5 శాతం కాగా, తక్కువ బరువుతో ఉన్న పిల్లలు 20 శాతం, రక్తహీనతతో బాధపడే మహిళల శాతం 51.4 ఉంది.

పేదలకు పంచి.. ఆకలి తీర్చి..



నిర్మల్ జిల్లాకు చెందిన నరహరి, ఆయన మిత్రులు నవీన్, వినోద్, చిట్టినేత, రామ్‌రాజ్ తదితరులు కలిసి ఫుడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఆహారం వృథాగా ఉన్న సమాచారం అందిస్తే అక్కడి నుంచి ఆహారాన్ని తీసుకొచ్చి అవసరమైన వారికి పంచిపెడుతున్నారు.


రెబ్బెనలో మాట్లాడుతున్న ఎంపీ నగేష్

భాజపాతోనే దేశ రక్షణ, రైతుల సంక్షేమం

రెబ్బెన, న్యూస్‌టుడే: దేశ రక్షణ, రైతుల సంక్షేమం, పేదలకు అండగా నిలబడేది భాజపాయేనని ఎంపీ గోడం నగేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నారాయణపూర్ గ్రామంలో పార్టీ మండలాధ్యక్షుడు గోలెం తిరుపతి అధ్యక్షతన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి సభ్యత్వాలు అందజేశారు. పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో అతి ఎక్కువ సభ్యత్వం ఉన్న పార్టీ భాజపా అని, అన్నివర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధిని చూసి ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్‌రోడ్ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని, నంబాల రైల్వేగేట్ వద్ద ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలని పార్టీ మండలాధ్యక్షుడు గోలెం తిరుపతి ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా. . నిర్మిస్తానని హామీనిచ్చారు. ముందుగా గోలేటిలో ఇటీవల గాయపడ్డ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఎస్.లక్ష్మిని పరామర్శించారు. సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, ఆదిలాబాద్ పార్లమెంటు కో-కన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, నాయకులు కృష్ణకుమారి, మైలారం సుగుణాకర్, సుదర్శన్‌గౌడ్, ఓదెలు, రాచకొండ రాజయ్య, మల్రాజు రాంబాబు, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

తిర్యాణి: గ్రామస్థాయిలో భాజపాను పటిష్ఠం చేయాలని దానికోసమే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీ గోడం నగేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలో అటవీ అనుమతులు లేని కారణంతో పనులు నిలిచిన రహదారులకు అనుమతులు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పూర్తి చేస్తానని హామీనిచ్చారు. తిర్యాణి నుంచి మాదారం మూడో గని వరకు, తిర్యాణి నుంచి మంగీ వరకు, దుగ్గపూర్ చింత నుంచి గంభీరావుపేట వరకు రహదారి నిర్మించాలని నాయకులు ఎంపీకి వినతి పత్రాలు సమర్పించారు.

గీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం కృషి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : గీత కార్మికుల రక్షణ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా ఆబ్కారీ అధికారి జ్యోతి కిరణ్‌లతో కలిసి పాల్గొని మాట్లాడారు. వృత్తి సమయంలో ప్రమాదాలు జరగకుండా వారికి తగిన శిక్షణ ఇచ్చి కాటమయ్య రక్షణ కిట్లను అందిస్తున్నట్లు చెప్పారు. సిర్పూర్ నియోజకవర్గాల్లో 38 మందికి కిట్లు అందించామని, ఆసిఫాబాద్‌లో 31 మందికి అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కిట్లను ధరించి చెట్లు ఎక్కాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే లక్ష్మి మాట్లాడుతూ.. తరాలుగా వృత్తిని కొనసాగిస్తూ జీవనోపాధి పొందుతున్న వారు రక్షణ కిట్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఏసీఎస్ ఛైర్మన్ అలీబిన్ అహ్మద్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సజీవన్, ఆబ్కారీ సీఐ రమేశ్, గౌడ సంఘం నాయకులు, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, మహేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


కాటమయ్య కిట్లతో గీత కార్మికులు, చిత్రంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా ఆబ్కారీ అధికారి జ్యోతి కిరణ్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సజీవన్

ఏర్పాట్లు పరిశీలించి.. సూచనలు చేసి

- భీం వర్ధంతికి మంత్రి సీతక్క రాక

కెరమెరి, న్యూస్‌టుడే : పోరాట యోధుడు కుమురం భీం వర్ధంతిని పకడ్బందీగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ శ్రీనివాసరావులతో కలిసి మండలంలోని జోడేఘాట్‌ని సందర్శించారు. ముందుగా భీం విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పార్కింగ్, భోజన వసతి, సభా వేదిక, స్టాల్, వీఐపీ గ్యాలరీ, భీం విగ్రహం, విద్యుత్తు సౌకర్యం వంటి తదితర ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి సూచనలు చేశారు. పండగ వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా సహకరించాలన్నారు. వచ్చే వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాగా ఈ కార్యక్రమానికి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క రానున్నారన్నారు.

☛ ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. అదనపు ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 15 సీఐలు, 28 మంది ఎస్సైలు, 460 మంది పోలీసుల బలగాలతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భీం మనవడు సోనేరావు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెందుర్ రాజేశ్వర్, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఐటీడీఏ ఏపీవో (పీవీటీజీ) మెస్రం మనోహర్, డీడీ రమాదేవి ఆయా శాఖల అధికారులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

కొత్త గురువులకు కౌన్సెలింగ్ పరీక్ష

- ఉదయం నుంచి రాత్రి వరకు తప్పని నిరీక్షణ..

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన డీఎస్సీ ఉపాధ్యాయులకు పాఠశాలల పోస్టింగుల కౌన్సెలింగ్ వారి సహనానికి పరీక్ష పెట్టింది. ఉదయం తాత్కాలికంగా వాయిదా పడ్డ ప్రక్రియ తిరిగి మధ్యాహ్నం కొనసాగడంతో ఎస్జీటీలకు రాత్రి వరకు నిరీక్షణ తప్పలేదు. కేంద్రంలో నీడ కోసం టెంటు, కుర్చీలు లేక ఎండలోనే గంటల తరబడి వేచి ఉన్నారు. అభ్యర్థులు వారి కుటుంబీకులతో కలిపి సుమారు 350 మంది రావడంతో ఆవరణ కిటకిటలాడింది. జాబితా తయారీ కూడా జాప్యానికి కారణమైంది. ఉదయం నుంచి రాత్రి వరకు నిరీక్షించిన అభ్యర్థులకు మంచి నీటి సదుపాయం కూడా కల్పించలేదని నిరసన వ్యక్తం చేశారు. పొద్దుపోయాక కూడా ప్రక్రియ కొనసాగగా.. లైటింగ్ లేక చీకట్లో ఇబ్బందులు పడ్డారు. తర్వాత లైట్లు ఏర్పాటు చేశారు. కాగా ప్రక్రియ రాత్రివరకు కొనసాగడంతో.. అధికారులు పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వలేకపోయారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు ఉత్తర్వులు తీసుకుని అదేరోజు పాఠశాలలో చేరాలని సూచించారు.

వాయిదాతో నిరాశ చెందినా..

ఉదయం 10 గంటలకు నియామక ఉత్తర్వులు, ర్యాంకు కార్డు, ఫొటోలతో స్కూల్ అసిస్టెంటు, ఎస్జీటీలకు ఎంపికైన వారు కౌన్సెలింగ్‌కు తప్పకుండా హాజరు కావాలని డీఈవో ప్రకటించారు. జిల్లాలోని అభ్యర్థులతో పాటు ఇతర జిల్లాల్లో ఉన్నవారు సమయానికి హాజరైనా.. ప్రక్రియ వాయిదా పడిందనడంతో నిరాశకు గురయ్యారు. రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ సంచాలకుల నుంచి ఆదేశాలు వచ్చేవరకు నిర్వహించరాదని ఆదేశించడంతో.. అధికారులు ఇదే విషయాన్ని అభ్యర్థులకు తెలిపారు. ఈక్రమంలో మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కౌన్సెలింగ్‌ను కొనసాగించాలని డీఎస్ఈ నుంచి ఆదేశాలు రావడంతో.. వెంటనే అభ్యర్థులకు చేరవేశారు. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత స్కూల్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్ వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఆర్‌వో లోకేశ్వర్, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో.. మొదలై సాయంత్రం 4.40 గంటల వరకు ముగిసింది. 83 మంది వివిధ విషయాలకు చెందిన వారు కోరుకున్న పాఠశాలలకు పోస్టింగ్ ఇచ్చారు. సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో ఎస్జీటీ కౌన్సెలింగ్ ప్రారంభం కాగా రాత్రి 9గంటల వరకు కొనసాగింది. మొత్తం 182మంది ఎస్జీటీలకు పాఠశాలల కేటాయింపు చేశారు.


కౌన్సెలింగ్ ప్రక్రియ పర్యవేక్షిస్తున్న వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి, అదనపు పాలనాధికారి దీపక్ తివారీ, డీఆర్‌వో లోకేశ్వర్‌రావు

హిందీ పండితుల ధ్రువపత్రాల పునఃపరిశీలన

ఎస్ఏల కౌన్సెలింగ్ అనంతరం ఏడుగురు హిందీ స్కూల్ అసిస్టెంట్లు, హిందీ పండితుల కౌన్సెలింగ్ జరపకుండా ఎస్జీటీలది ప్రారంభించడంతో.. సంబంధిత అభ్యర్థులు తమది ముందుగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాగా వీరి ధ్రువపత్రాలపై ఫిర్యాదులు ఉండటంతో.. ఆర్‌జేడీ ఆధ్వర్యంలో పునఃపరిశీలన కోసం వారిని వేచి ఉండాలని సూచించారు. కాగా మరో ఇద్దరు ఎస్ఏ అభ్యర్థుల ధ్రువపత్రాలు అభ్యంతరకరంగా ఉండటంతో వారికి కౌన్సెలింగ్ నిర్వహించకుండా వెనక్కి పంపించారు.


విద్యుత్తు దీపాలు లేక చీకట్లోనే ఉపాధ్యాయుల నిరీక్షణ


కేంద్రం వద్ద అభ్యర్థులు



జానకి షర్మిల, ఎస్పీ

ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్.. వేదికేదైతేనేం చాలామంది తమ అభిరుచికి అనుగుణంగా చిన్నచిన్న వీడియోలు, ఫొటోలతో ప్రపంచం ముందుకొస్తున్నారు. తమ అనుభవాలను పంచుకుంటున్నారు. కళాతృష్ణను తీర్చుకుంటున్నారు. కాస్త సృజనాత్మకతను జోడించి ప్రత్యేకంగా నిలుస్తున్నారు. ఇలాంటి వ్యక్తుల్లో మీరూ ఉన్నారా.. అయితే ఈ అవకాశం మీకోసమే. పోలీసు అమరవీరుల సంస్మరణ ఉత్సవాలను పురస్కరించుకొని ఔత్సాహికుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు, పోలీసుశాఖ సేవలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహిస్తున్నారు. - న్యూస్‌టుడే, నిర్మల్ పట్టణం

చిత్రం తీస్తారా.. లఘుచిత్రం రూపొందిస్తారా..!

● పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోటీలు

ఏం చేయాలంటే..

అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఏటా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టనుంది. ఫొటో-వీడియోగ్రాఫర్లతో పాటు విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు జరపనుంది. పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపేలా ఇటీవల కాలంలో తీసిన 3 ఫొటోలు, 3 నిమిషాల్లోపు నిడివితో ఉన్న లఘుచిత్రాలు రూపొందించి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించొచ్చు. వీటిని పెన్‌డ్రైవ్‌లో వేసి, ఫొటోలు 10/8 పరిమాణంలో సిద్ధం చేయాలి. మూఢనమ్మకాలు-ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తిప్రతిష్ఠలు, సైబర్‌నేరాలు- ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మత్తుపదార్థాల వినియోగం- కలిగే అనర్థాలపై గత సంవత్సరం అక్టోబరు నుంచి ఈ సంవత్సరం అక్టోబరు వరకు తీసిన ఫొటోలు, లఘుచిత్రాలు పోటీలకు పంపించేందుకు అవకాశముంది. జిల్లాస్థాయిలో తొలి మూడుస్థానాల్లో నిలిచిన వాటిని రాష్ట్రస్థాయికి పంపించనున్నారు. అక్కడ గెలుపొందిన వారికి నగదు పురస్కారం లభిస్తుంది.

ప్రతిభ చాటుకునే అవకాశం


మావోయిస్టులు, టెర్రరిస్టులు, సంఘవ్యతిరేకశక్తులతో పోరాడే క్రమంలో అమరులైన వారి త్యాగాలను స్మరిస్తూ ఏటా వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పలురకాల పోటీలు నిర్వహిస్తుంటాం. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన వారికి బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేస్తాం. తీసిన చిత్రాలు, రూపొందించిన లఘుచిత్రాలను జిల్లా పోలీసు కార్యాలయంలోని ఐటీ కోర్ విభాగంలో ఈనెల 20 లోపు అందజేయాలి. ఏవైనా సందేహాలుంటే చరవాణి 87125 77719లో సంప్రదించాలి.

-డా.జి.జానకి షర్మిల, ఎస్పీ, నిర్మల్

ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు

ఇంటర్మీడియట్ వరకు ఉన్న విద్యార్థులు విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వినియోగం, డిగ్రీ ఆపైన విద్యార్థులకు తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశాలపై ఆన్‌లైన్ వేదికగా వ్యాసరచన పోటీలుంటాయి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూమాధ్యమాల్లో రాసేందుకు అవకాశముంది. విద్యార్థులు తాము రాసిన వ్యాసాలను nirmalitct@gmail.com కి అక్టోబరు 20 లోపు మెయిల్ చేయాలి. ఉత్తమంగా ఉన్న వాటిని ఎంపికచేసి బహుమతులు అందజేస్తారు. అత్యుత్తమంగా ఉన్నవాటిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేస్తారు.

గిజిగాడు.. సాహసికుడు!



పిచ్చుకలు తమ సంతాన రక్షణకు నిర్మించుకునే గూళ్లలో చూపించే నైపుణ్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. కుంటలు, చెరువుల్లోకి వంగిన చెట్ల కొమ్మలకు సమూహాలుగా ఒకేచోట వేలాడేలా నిర్మించుకుంటాయి. మరికొన్ని గిజిగాని సమూహాలు మాత్రం ఒక అడుగు ముందుకేసి పాములు ఇతర శత్రువుల బారి నుంచి గుడ్లు, పిల్లల్ని కాపాడుకునేందుకు ఏకంగా కరెంటు తీగలకు గూళ్లు అల్లుకుంటాయి. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి - డ్యాంగాపూర్ గ్రామాల మధ్య పచ్చని పంట పొలాలపై ఉన్న విద్యుత్తు తీగలకు పక్షులు వందల సంఖ్యలో గూళ్లు నిర్మించుకున్నాయి. దారిన పోయేవారికి కరెంటు తీగలకు తోరణాలు కట్టారా అన్నంత గుంపులుగా ఉన్నాయి.

- చిత్రం: న్యూస్‌టుడే, నిర్మల్

ఈ యువకులు సాంస్కృతిక వారసులు



తయారు చేసిన గుస్సాడీ టోపీతో మడావి సోను



టోపీ తయారు చేస్తున్న సెడ్మకీ కోండు

లింగాపూర్, న్యూస్‌టుడే: దీపావళి సమీపిస్తుండటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ గూడేల్లో దండారీ ఉత్సవాల సందడి మొదలైంది. ఆదివాసీ గిరిజన జీవనశైలి, సంస్కృతి ప్రతిబింబించే పండగల్లో ప్రధానమైంది దండారీ వేడుక. ప్రత్యేకంగా నెమలి ఈకలతో తయారుచేసిన టోపీలు ధరించి గుస్సాడీ వేషధారణలతో ఈ పండగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీ. పండగకు కొన్ని రోజుల ముందు నుంచే గూడేల్లో కోలాహలం ప్రారంభమవుతుంది. నెమలి ఈకలు సేకరించి టోపీలు తయారు చేయడంలో పలువురు పెద్దలు ప్రత్యేకత చాటుకుంటున్నారు. పెద్దల నుంచి తయారీలో మెళకువలు నేర్చుకుని ఓవైపు జీవనోపాధితోపాటు మరోవైపు సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ఆచరిస్తూ వారసత్వ సంపదను కాపాడుకుంటున్నారు.. కుమురంభీం జిల్లా లింగాపూర్ మండలం పిట్టగూడ గ్రామానికి చెందిన యువకులు సెడ్మకీ కోండు, మాడావి సోను. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇంటర్ పూర్తయిన తర్వాత పైచదువులకు వెళ్లలేకపోయారు. తమ కాళ్ల మీద తాము నిలబడాలనే ఉద్దేశంతో టోపీల తయారీపై దృష్టి పెట్టి ఉన్న ఊళ్లోనే ఉపాధి పొందుతున్నారు. ఏటా ఉత్సవాలకు 150-200 వరకు టోపీలు తయారు చేస్తుంటారు. ఉమ్మడి జిల్లాతో పాటు జగిత్యాల, మహారాష్ట్రలోని పలు జిల్లాలకు గుస్సాడీ టోపీలను తయారు చేసి పంపిస్తున్నారు. ఒక టోపీ తయారీకి రూ.2500 నుంచి రూ.3 వేలు తీసుకుంటున్నట్లు వారు చెప్పారు.

పత్తి విక్రయాల్లో సాంకేతికత

● అందుబాటులోకి వాట్సాప్ నెంబరు 88972 81111



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం: పత్తి విక్రయాల సమాచారం తెలుసుకునేందుకు వీలుగా ఈ సీజన్‌లో మార్కెట్ అధికారులు సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంలో పత్తిని ఎక్కడ, ఎంత మొత్తం విక్రయించాలి, డబ్బులు ఎప్పుడు బ్యాంకులో జమ చేస్తారనే సమాచారం కోసం రైతులు ఇబ్బందులు పడేవారు. పత్తి క్రయవిక్రయాల్లో అక్రమాలను అరికట్టడంతో పాటు, రైతులు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు వీలుగా 'వాట్సాప్' సేవలను అందుబాటులోకి తెచ్చారు. రైతులు వాట్సాప్ నెంబరును నమోదు చేసుకుని 'హాయ్' అని సందేశం పంపడంతో పాటు తమ ఆధార్‌కార్డు నమోదు చేస్తే కావాల్సిన సమాచారం తెలుసుకునే అవకాశం ఉంది. ఇందుకోసం ఆయా పత్తి రైతులు 88972 81111 నెంబరును నమోదు చేసుకోండి.

ఉమ్మడి జిల్లాలో 9 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుంది.. ఈ లెక్కన ఈ సీజన్‌లో 68 లక్షల క్వింటాళ్ల పత్తి మార్కెట్టుకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. రైతుల సమస్యలకు పరిష్కారంగా వన్ సాఫ్ట్‌వేర్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. పత్తి విక్రయాలు, అర్హత, అమ్మకాల వివరాలు, తేమశాతం, షెడ్యూల్ స్థితి, సీసీఐ కేంద్రాల్లో వేచి ఉండే సమయం, కొనుగోలు వివరాలు తదితర వాటిని తెలుసుకునే వీలుంది. పంట సమగ్ర సర్వే, బ్యాంకు, ఆధార్ కార్డుతో అనుసంధానం ఉన్న చరవాణి నెంబరుతో వాట్సాప్ సేవలను పొందే అవకాశం ఉంది.

సమస్త సమాచారం

- గజానంద్, డీఎంఓ, ఆదిలాబాద్

పత్తి విక్రయాలకు సంబంధించి సమస్త సమాచారం తెలుసుకునేందుకు వీలుగా ఈ సీజన్‌లో వాట్సాప్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

రూ. 7 రుసుం.. చెల్లించటం ఎంత కష్టమో





● సంఘటిత కార్మికుల దరిచేరని సంక్షేమం

కార్మికుడి వాటా రూ.2, పని చేసే సంస్థ వాటా రూ.5. రెండూ కలిపితే రూ.7 అవుతుంది. వాటిని ఏడాదికోసారి కార్మిక మండలి నిధికి చెల్లిస్తే కొంత లబ్ధి చేకూరుతుంది. కానీ అది చెల్లించకపోవటంతో సంక్షేమ ప్రయోజనాలు కార్మికులకు చేకూరడం లేదు. కార్మిక మండలి ద్వారా చెల్లించే ప్రోత్సాహకాలతో తక్కువ ...

ఈటీవీ - ఆదిలాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంఘాలు, షాపులు, సేవల సిబ్బంది, ప్రైవేటు విద్యా, వైద్య సంస్థలు, జిన్నింగ్ పరిశ్రమలు సహా అన్ని రకాల దుకాణాల్లో పని చేసే సంఘటిత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా 1987 నుంచి ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ నిధి చట్టం అందుబాటులోకి వచ్చింది. 2014లో తెలంగాణ కార్మిక సంక్షేమ మండలిగా రూపాంతరం చెందిన కార్మిక సంక్షేమ నిధిగా మారింది. కార్మికుల వివాహ కానుక, విద్యా ప్రోత్సాహకాలు, దివ్యాంగులైన కార్మికుల పిల్లలకు విద్యా ప్రోత్సాహకాలు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స ఖర్చులు, ప్రమాద, సహజ మరణాల్లో అందించాల్సిన పరిహారమంతా నామమాత్రంగా మారింది.

పట్టింపు శూన్యం

కార్మిక సంక్షేమ మండలి ద్వారా ప్రభుత్వం అమలు చేసే పథకాలపై అవగాహన కొరవడుతోంది. ఏడాదికి కార్మికుడి వాటా రూ.2, సంస్థ వాటా రూ.5 చొప్పున రూ.7 చెల్లిస్తే కార్మిక మండలి నిధిలో చెల్లిస్తే ప్రభుత్వం అమలు చేసే ప్రోత్సాహకాలను పొందేందుకు ఆస్కారముంటుంది. కార్మికశాఖ సహా వివిధ సంస్థల పట్టింపులేనితనంతో కార్మిక మండలి నిధి సరిగా అమలు కావటం లేదు. ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు పరిశ్రమలు, ఇతర సంస్థల్లో ఎంత మంది కార్మికులు పని చేస్తున్నారనేది నిర్దిష్టంగా తెలియటం లేదు. కార్మికశాఖలో పేర్లు నమోదు చేసుకున్న వివరాల ప్రకారం కేవలం 13,903 దుకాణాల్లో 40,026 మంది కార్మికులు పని చేస్తున్నట్లు తేలింది. మిగిలిన పరిశ్రమలు, సంస్థల పేర్ల నమోదు పట్టింపులేని అంశంగా మారింది.

ఏపీలో భేష్

ఆంధ్రప్రదేశ్‌లో కార్మికుడి వాటా రూ.30, సంస్థ వాటా రూ.70 చొప్పున ఏడాదికి రూ.100 చెల్లించటంతో కార్మికులకు భరోసా కనిపిస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులకు రూ.50 వేలు, ప్రమాద మరణమైతే రూ.5 లక్షలు, ప్రమాదంతో వచ్చే అంగవైకల్యానికి రూ.1.25 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు సాయం లభిస్తోంది. ఏపీలో అమలు చేసినట్లు ప్రోత్సాహకాలు అందిస్తే పేద కార్మికులకు మేలు కలుగుతుంది.

అనేక ప్రయోజనాలున్నా..

కార్మిక శాఖలో దుకాణం పేరు నమోదైతే కార్మికులకు దీర్ఘకాలిక వ్యాధులకు గురైతే చికిత్సకు రూ.20 వేల వరకు పొందొచ్చు. ప్రమాదంలో చనిపోతే రూ.30 వేలు, సహజ మరణమైతే రూ.10 వేలు, అంత్యక్రియలకు రూ.5 వేలు, అంగవైకల్యం బారినపడితే రూ.10 వేల నుంచి రూ.20 వేల సాయం పొందొచ్చు. పెళ్లి కానుకగా రూ.10 వేలు, ప్రసూతి సాయం రూ.5వేలు, పిల్లల ఉపకార వేతనాలుగా రూ.1000 నుంచి రూ.2 వేల వరకు లబ్ధి చేకూరుతుంది.

పాలకుల తప్పిదమే



ఆంధ్రప్రదేశ్‌తో పోల్చుకుంటే రాష్ట్రంలో కార్మికులకు ప్రయోజనమేమి కలగటం లేదు. ప్రభుత్వాలే తమ కార్మికులవైతే, పట్టింపులేనితనం సంస్థలది. అందుకే విశ్రాంత అధికారిగా ఈ నెల 16న కార్మిక భేరి ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

- జగదీశ్వర్‌రెడ్డి, విశ్రాంత కార్మిక శాఖాధికారి

జిల్లాల వారీగా పేర్లు నమోదు చేసుకున్న దుకాణాలు, కార్మికుల వివరాలు (● జిల్లా ● దుకాణాలు ● కార్మికులు)

జిల్లా	దుకాణాలు	కార్మికులు
ఆదిలాబాద్	2650	7650
నిర్మల్	2380	6860
మంచిర్యాల	7250	20753
ఆసిఫాబాద్	1623	4763

గురుకుల భవనాలకు తాళం వేసిన యజమానులపై కేసు

తాండూరు: మహాత్మా గాంధీ జ్యోతిబాపులే బీసీ గురుకుల పాఠశాల కొనసాగుతున్న ప్రైవేటు భవనానికి అద్దె చెల్లించడం లేదని యజమాని శరత్‌కుమార్ మంగళవారం ఉదయం ప్రధాన ద్వారానికి తాళం వేశారు. యజమాని మాట్లాడుతూ 9 నెలలుగా అద్దె చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అద్దె చెల్లించే వరకు తాళాలు తీయనని తెలిపారు. పాఠశాలకు తాళం వేయడంతో సిబ్బందితోపాటు విద్యార్థులు ఇబ్బందులు పడ్డట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వినోద్‌కుమార్ తాండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో భవన యజమాని శరత్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

బెల్లంపల్లి పట్టణం: మహాత్మాగాంధీ జ్యోతిబాపులే బీసీ వెల్ఫేర్ పాఠశాల, జూనియర్ కళాశాల అద్దె భవనానికి తాళం వేసిన యజమాని రుషిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ దేవయ్య తెలిపారు. పాఠశాల భవనానికి తాళం వేయడంతో బోధన సిబ్బంది, విద్యార్థులు ఇబ్బంది పడ్డారని ప్రిన్సిపల్ పి.రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

అర్చకుల కొరత.. అక్షరాభ్యాసాలకే సుముఖత

● బాసర క్షేత్రంలో కొరవడుతున్న పర్యవేక్షణ

ఈటీవీ- ఆదిలాబాద్: బాసర జ్ఞాన సరస్వతీ క్షేత్రంలో అర్చకుల కొరత పూజాది కార్యక్రమాలకు ప్రతిబంధకంగా మారుతోంది. అమ్మవారి అభిషేకం, అర్చనలో కీలకమైన వేదపండితులు సహా సాధారణ అర్చకులు చాలినంత మంది లేక ఇబ్బందులకు దారి తీస్తోంది. చదువులమ్మ ఆలయం ఇన్‌ఛార్జి ఈవో పర్యవేక్షణలో కొనసాగుతోంది. రెగ్యులర్ ఈవోగా ఉన్న విజయరామారావును మే నెలలో ప్రభుత్వం నిజామాబాద్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేసింది. బాసర ఇన్‌ఛార్జి ఈవోగా పరిమితం చేయడంతో పర్యవేక్షణ పట్టుతప్పుతోంది.

బాసరలో అమ్మవారి అభిషేకంలో వేద పండితులు, అక్షరాభ్యాసాల్లో అర్చకుల పాత్ర కీలకం. సరిపడినంత మంది వేద పండితులు, అర్చకులు లేనందున విధుల నిర్వహణపై ప్రభావం పడుతోంది. ప్రభుత్వం మంజూరు చేసిన ఎనిమిది మంది వేద పండితులకు నలుగురితోనే సరిపెట్టుకుంటున్నారు. మరో నాలుగు పోస్టులు భర్తీ కావడం లేదు. పూజాది కార్యక్రమాలతోపాటు అక్షరాభ్యాసాలకు 21 అర్చకుల పోస్టులకు 15 మందితోనే కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఫలితంగా ప్రత్యేక పూజాది కార్యక్రమాలతో కూడిన విధుల నిర్వహణ కన్నా వ్యక్తిగత ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో అక్షరాభ్యాసాల విధుల కోసం కొంతమంది అర్చకులు పట్టుబడుతుండటంతో అంతర్గత వివాదాలకు కారణమవుతోంది. ఇటీవల హారతిలో డబ్బులు వేసే సంప్రదాయాన్ని అధికారులు రద్దు చేశారు. అక్షరాభ్యాసాలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చిన తర్వాత కనీసం కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన రెగ్యులర్ ఉద్యోగి లేక కాంట్రాక్టు పద్ధతిలో ఒకరిని నియమించుకోవాల్సి వచ్చింది. ఈ విషయమై ఇన్‌ఛార్జీ ఈవో విజయరామారావును సంప్రదించగా ఖాళీల కారణంగా పూజాది కార్యక్రమాలపై ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేదపండితులు, అర్చకులు కలిపి మరో 10 మందిని నియమిస్తే ఏ ఇబ్బంది ఉండదని తెలిపారు.

తమ్ముడి తలపై కర్రతో కొట్టిన అన్న

● చికిత్స పొందుతూ మృతి

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్నపాటి సమస్యకే అన్నదమ్ములిద్దరూ గొడవ పడ్డారు. క్షణికావేశంలో అన్న కర్రతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన తమ్ముడు కొడిపె మల్లయ్య(45) చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం అక్కేపల్లికి చెందిన కొడిపె భీమయ్య, మల్లయ్యలు అన్నదమ్ములుకాగా మద్యం తాగి తరచూ ఘర్షణ పడుతుండేవారు. ఈ నెల 13న రాత్రి బాత్రూం నీళ్ల విషయంలో అన్నదమ్ములిద్దరూ గొడవ పడ్డారు. ఆవేశంలో భీమయ్య మల్లయ్య తలపై కర్రతో బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావం అయింది. కుటుంబ సభ్యులు చెన్నూరు సామాజిక ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ రవీందర్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.





ఎడ్ల బండ్లలో వెళుతున్న ఆదివాసీ మహిళలు, పోరాట యోధుడి పాటపై ర్యాలీ చిత్రీకరణ దృశ్యాలు

గోండు వీరుడి గాథపై ప్రత్యేక గీతం

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : కుమురం భీం పోరాటం, జీవిత చరిత్రను ప్రజలకు చేరువ చేసేందుకు ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా ప్రత్యేక గీతాన్ని రూపొందించారు. ఆమె పర్యవేక్షణలో నాడు భీం చేసిన పోరాటంపై ప్రత్యేకంగా చిత్రీకరించారు. పీఓ పర్యవేక్షణలో రాసిన 'తెలంగాణ ముద్దు బిడ్డా.. మన గిరిజన గోండు బిడ్డా' అనే గీతంపై ఇంద్రవెల్లి మండలం తుమ్మగూడ గోండులతో పరిసర ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనను చిత్రీకరించారు. కెరమెరి మండలం జోడేఘాట్ పరిసర ప్రాంతంలో రజాకార్ల సైనికులపై కుమురం భీం చేసిన పోరాట దృశ్యాలను సైతం చిత్రీకరించారు. 17న వర్ధంతి రోజు గీతాన్ని ఆవిష్కరించి గిరిజన గ్రామాలలో ప్రదర్శించేందుకు పీఓ ప్రణాళిక సిద్ధం చేశారు.



గుడిపేట పటాలంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కమాండెంట్ వెంకటరాములు



గుడిపేట పటాలంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అట్టహాసంగా క్రీడా సంబరం

హాజీపూర్, న్యూస్‌టుడే: మండలంలోని గుడిపేట పోలీసు పటాలంలో మంగళవారం వార్షిక స్పోర్ట్స్‌మీట్ పోటీలను కమాండెంట్ వెంకటరాములు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం అనేక సవాళ్లతో కూడిన విధులు నిర్వహించే పోలీసులకు మానసికంగా, శారీరకంగా నూతనోత్తేజం కల్పించేందుకు ఈ క్రీడలు ఉపయోగపడనున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు పటాలంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి పరుగు పందెం, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, టగ్‌ఆఫ్ వార్ వంటి పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు నాగేశ్వర్‌రావు, కాళీదాస్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన సబ్ జూనియర్ విద్యార్థినులు నాగేశ్వరి, వైష్ణవి, నందిని, సరోజ



జూనియర్ విద్యార్థినులు సోని, జంగుబాయి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం జంగు, గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి తెలిపారు. ఈ నెల 9న నల్గొండలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఖోఖో ఎంపిక పోటీల్లో క్రీడా పాఠశాల విద్యార్థినులు సబ్ జూనియర్ బాలికల విభాగంలో నాగేశ్వరి, వైష్ణవి, నందిని, సరోజ, జూనియర్ విభాగంలో సోని, జంగుబాయిలు అత్యుత్తమ ప్రతిభ చాటి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈ నెల 16, 17 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు నుంచి ఆడనున్నట్లు వివరించారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థినులను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, తదితరులు అభినందించారు.

పర్వతారోహణ శిక్షణ శిబిరానికి మనోళ్లు

మామడ, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ నెల 16 నుంచి 27 వరకు జరిగే జాతీయ స్థాయి పర్వతారోహణ శిక్షణ శిబిరం(ఆర్‌సీటీసీ)లో పాల్గొనే అరుదైన అవకాశం జిల్లా నుంచి ముగ్గురికి వచ్చింది. మామడ మండలం పొన్కల్ జడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి పూర్ణచందర్ నేతృత్వంలో నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కడెం జడ్పీహెచ్ఎస్ కేడెట్లు వసంత్, సుమంత్ ఈ శిబిరంలో పాల్గొననున్నారు. దేశ వ్యాప్తంగా 9 ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి 273 మంది కేడెట్లు ఆర్‌సీటీసీలో శిక్షణ పొందనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం 28 మందికే ఈ అవకాశం దక్కింది. ఈ శిక్షణ శిబిరంలో పర్వతారోహణలో ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఆత్మవిశ్వాసం, జట్టుస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై మిలటరీ అధికారులు శిక్షణనిస్తారు. ఈ మేరకు పూర్ణచందర్, వసంత్, సుమంత్ మంగళవారం గ్వాలియర్‌కు బయలు దేరారు.



గ్వాలియర్ వెళ్తున్న ఎన్‌సీసీ అధికారి, కేడెట్లు

ఓటుహక్కు నమోదుకు ప్రత్యేక కౌంటరు

ఖానాపూర్, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు పట్టభద్రుల ఓటు నమోదుకు తహసీల్దార్ కార్యాలయంలో కౌంటరు ఏర్పాటు చేశామని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. 2021 నవంబరు 1 లోపు డిగ్రీపూర్తిచేసిన అభ్యర్థులు ఫారం-18, 19లలో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే అవకాశముందని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 83418 12400
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:

? మండలంలోని నాగంపేట పంచాయతీ కేంద్రంలో మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో అపరిశుభ్రత నెలకొంది.
- అంకూస్, స్థానికుడు

✔ రెండ్రోజుల్లోగా పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. **- రమేష్, ఎంపీడీఓ కాగజ్‌నగర్**

? మండలంలోని బారెగూడ పంచాయతీ పరిధి ఫాకీజానగర్‌లో మురుగు కాలువలు లేక వృథా నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఇబ్బందులు పడుతున్నాం. **- కుర్షీద్‌బాయ్, స్థానికుడు**

✔ మండలంలోని ఆయా గ్రామాల్లో మురుగు కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం.**- రమేష్, ఎంపీడీఓ కాగజ్‌నగర్**

సిర్పూర్(టి), న్యూస్‌టుడే

? మండలంలోని ఎస్సీ కాలనీలో, ఎస్బీఐ బ్యాంకు వద్ద కాలనీల్లో 20 రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక అవస్థలు పడుతున్నాం.
- నిఖిల్ కాలనీవాసి

✔ పైపులు మరమ్మతులకు గురయ్యాయి. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. **- తిరుపతి, పంచాయతీ కార్యదర్శి, సిర్పూర్(టి)**

శిబిరం నిర్వహించి.. చికిత్సలు చేసి

వాంకిడి, న్యూస్‌టుడే: మండలంలోని గోండు కోసార గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 43 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వరాలతో బాధపడుతున్న తొమ్మిది నుంచి రక్త నమూనాలు సేకరించారు. ముందుగా వైద్య, గ్రామపంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఖాళీ పాత్రలు, పాత కూలర్లు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారంలో ఒక రోజు ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, ఏఎన్ఎం సునంద, ఆశా సువర్ణ, బ్రీడింగ్ చెక్కర్ దిలీప్ పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది


మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

సమరయోధులుగా గుర్తించాలని డిమాండ్

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో తొలి, మలి విడత ఉద్యమాల్లో అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులను సమరయోధులుగా గుర్తించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్త సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. 1969లో తొలి విడత ఉద్యమం ప్రారంభం కాగా పది నెలలపాటు నిరవధికంగా విద్యార్థుల ఉద్యమంగా ప్రపంచంలోనే ప్రత్యేకతను చాటుకుందన్నారు. అప్పట్లో విద్యాసంవత్సరం కోల్పోయిన బాధిత ఉద్యమకారులను అన్ని విధాలా ఆదుకుని పింఛన్లు, ఇళ్ల స్థలాలు, పిల్లలకు రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నారు. నారాయణ, కలికోట రమణయ్య, చిలుక లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రావు, తదితరులున్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి రామన్‌కాలనీ సమీపంలోని రైల్వేట్రాక్‌పై ప్రవీణ్‌కుమార్(36) అనే యువకుడు మంగళవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. వాంకిడికి చెందిన ప్రవీణ్ టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజులుగా మానసికస్థితి బాగా ఉండటం లేదని ఈ క్రమంలో ఇక్కడికి వచ్చి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నట్లు తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన కోట బుచ్చయ్య(53) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఏఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బుచ్చయ్య ఈ నెల 11న రాత్రి గ్రామ సమీపంలోని తన చేనులో పురుగుమందు తాగి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. వెంటనే వారు అతన్ని కాగజ్‌నగర్ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తీసుకెళ్లారు. రెండు రోజుల చికిత్సల తర్వాత వరంగల్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. మద్యానికి బానిసైన బుచ్చయ్య మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై వివరించారు. మృతుడి భార్య తార ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.


కోట బుచ్చయ్య

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో దాదాపు 70-75 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆసిఫాబాద్ సీఐ సతీష్ తెలిపారు. ఈ నెల 8న జిల్లా కేంద్రంలో అనారోగ్యంతో ఉన్న అతన్ని 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. ప్రథమ చికిత్స తర్వాత అదే రోజు సాయంత్రం ఇక్కడి నుంచి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. చికిత్స పొందుతూ సదరు వ్యక్తి మృతి చెందాడన్నారు. ఎవరైనా గుర్తు పడితే సీఐ చరవాణి నం.87126 70506, ఎస్సై చరవాణి నం. 87126 70569 లో తెలియజేయాలని సూచించారు.


గుర్తు తెలియని వృద్ధుడు

దాడి చేసిన వారిని అరెస్టు చేయాల్సిందే

ఆసిఫాబాద్: ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పంచాయతీలో జరిగిన అక్రమాలపై కలెక్టర్ స్పందించి విచారణ జరిపించాలన్నారు.

కడంబా ప్లాంటేషన్‌లో కంది మొక్కల తొలగింపు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ ఫారెస్టు రేంజి పరిధిలోని ప్లాంటేషన్‌లో వేసిన కంది పంటను మంగళవారం తొలగించారు. పలువురు రైతుల కబ్జాలో ఉన్న పోడు భూమిని అటవీ అధికారులు రెండేళ్ల కిందట తమ ఆధీనంలోకి తీసుకొని ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. కాగా ఇటీవల అధికారులకు తెలియకుండా రైతులు కంది పంట సాగు చేశారు. ఈ విషయం తెలియడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డీఆర్వో రమాదేవి ఆధ్వర్యంలో సిబ్బంది ఆ మొక్కలను తొలగించారు.

అందుబాటులోకి సంచార ప్రయోగశాల


వాహనంలో పరికరాలు సిద్ధం చేస్తున్న సైన్సు ఉపాధ్యాయులు


సంచార ప్రయోగశాల వాహనం

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాకు కేటాయించబడిన సంచార ప్రయోగశాలను బుధవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలో జన్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద రాష్ట్ర మంత్రి సీతక్క చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా సైన్సు అధికారి కటుకం మధుకర్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ ప్రయోగశాల ద్వారా సైన్సు, గణితం ప్రయోగాలను చూపించనున్నట్లు పేర్కొన్నారు.

అవ్వాల్ పెన్ పూజలతో ఉత్సవాలకు శ్రీకారం


అవ్వాల్ పెన్ ఆలయం

జోడేఘాట్‌లో భీం వర్ధంతి కార్యక్రమాలు అవ్వాల్ పెన్ కార్యక్రమంతో ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయం ప్రకారం బుధవారం రాత్రి భీం మనవడు సోనేరావు, ఆదివాసీ పెద్దల సమక్షంలో అవ్వాల్ పెన్ (పోచమ్మ)కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం భీం విగ్రహం, సమాధి వద్ద పూజలు చేస్తారు. ఈ పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గురువారం జెండా వద్ద పూజలు, విగ్రహం, సమాధి వద్ద నివాళి అనంతరం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తారు. **- న్యూస్‌టుడే, కెరమెరి**

నేడు జిల్లాకు మంత్రి సీతక్క

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో బుధవారం ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క పర్యటించనున్నారు. జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 6 గంటలకు హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో జిల్లా కేంద్రానికి వస్తారు. మండలంలోని గుండి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి ఉన్నతీకరణ కావడంతో పరిశీలిస్తారు. అనంతరం జన్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సంచార ప్రయోగశాలను ప్రారంభిస్తారు. తరువాత కలెక్టరేట్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పీఎం జన్‌మన్ వాహనం, మండలంలోని అడ ప్రాజెక్టు వద్ద నిర్మించిన టూరిజం భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం అక్కడి ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేస్తారు. తరువాత మండలంలోని వట్టివాగు ప్రాజెక్టు సందర్శించి కట్ట రక్షణ కోసం శంకుస్థాపన చేస్తారు. తదనంతరం రెబ్బెన మండలం గోలేటి సింగరేణి అతిథి గృహం చేరుకొని రాత్రి బస చేస్తారు.




ఆసిఫాబాద్‌లో.. విశ్రాంత ఉద్యోగులు | కౌటాలలో.. | కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో..

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో మంగళవారం విశ్రాంత ఉద్యోగులు దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణాగౌడ్, ఆసిఫాబాద్ యూనిట్ అధ్యక్షుడు రమేశ్, సభ్యులు సిరాజుల్ హక్, కనకమ్మ, పుల్లూరి కిష్టయ్య, లింగయ్య, అచ్యుత్‌రావు, వెంకటయ్య, పద్మ, పోచన్న, వెంకటేష్, రామారావు, రామస్వామి, నర్సయ్య, వినోద్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో అబ్దుల్‌కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చేసిన సేవలను విద్యార్థులకు తెలియజేశారు. ఇన్‌ఛార్జి ఎంఈఓ గావిడే హన్మంతు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ గ్రామీణ: అబ్దుల్‌కలాం సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సతీష్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామరస్యంగా పరిష్కరించుకోండి: కలెక్టర్

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : సిర్పూర్ కాగితపు మిల్లుల ప్రతినిధులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల సమస్యలను సమన్వయంతో సామరస్యంగా పరిష్కరించుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లతో కలిసి కాగితపు మిల్లు ప్రతినిధులు, లారీ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇరువురి మధ్య నెలకొన్న సమస్యలపై కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కంపెనీ నిర్వహణ దృష్ట్యా మిల్లు ప్రతినిధులు స్థానిక లారీ యజమానులకు పని కల్పించాలని, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సమన్వయం చేసుకొని రవాణా ధరలు నిర్ణయించుకోవాలని పేర్కొన్నారు. మిల్లు అభివృద్ధితో పాటు లారీ యజమానులు లబ్ధి పొందేలా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. డీఎస్పీలు కరుణాకర్, రామానుజన్, మాజీ ఎమ్మెల్యే కోనప్ప, మిల్లు ప్రతినిధులు, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, చిత్రంలో ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

రెబ్బెన, న్యూస్‌టుడే: ఎన్‌హెచ్ఎం పథకంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 17,541 మంది ఉద్యోగులు 78 రకాల క్యాడర్‌లలో పని చేస్తున్నారని, వారందరినీ రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం రెబ్బెన పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. అప్పటి వరకు క్యాడర్ ఫిక్సేషన్, రెగ్యులర్ ఉద్యోగుల మూల వేతనం అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలన్నారు. గత పీఆర్సీ సందర్భంగా ఇవ్వాల్సిన ఏడు నెలల పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం సిబ్బంది, రెండో ఏఎన్ఎంలు ప్రమీల, పద్మ, సునీత, విజయలక్ష్మి, తులసి, వనిత, శ్రీవిద్య, రుచిత, మృదుల్‌మండల్ పాల్గొన్నారు.


వైద్యాధికారి మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

ఉపకార వేతనాల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు బోధన రుసుములు, ఉపకార వేతనాలు రానందున తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాల సంఘం చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని సాయితేజ, వివేకానంద, వసుంధర డిగ్రీ కళాశాల విద్యార్థులు రోడ్డెక్కారు. పట్టణ పెట్రోల్ పంపు ఏరియా నుంచి ప్రారంభమైన ర్యాలీ రాజీవ్ గాంధీ చౌక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు మాట్లాడుతూ.. మూడేళ్లుగా విద్యార్థులకు బోధన ఫీజుల బకాయిలు, ఉపకారవేతనాలు అందక యజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. నిర్వహణ తలకు మించిన భారమవుతోందని వాపోయారు. మూసివేసే దిశకు చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్స్ బి.శ్రీనివాస్, నిరత్కార్, అనుక్, పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో డిగ్రీ కళాశాల విద్యార్థుల నిరసన ర్యాలీ

పట్టువిడుపులతో వ్యవహరించండి

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సిర్పూరు పేపర్ మిల్లు (ఎస్పీఎం) వైఖరిని నిరసిస్తూ కాగజ్‌నగర్ లారీ యజమానులు, డ్రైవర్ల అసోసియేషన్ చేపట్టిన ఆందోళన ఇంకా కొలిక్కి రాలేదు. మంగళవారం లారీ అసోసియేషన్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి కుటుంబ సభ్యులతో ధర్నా చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆయన సతీమణి రమాదేవి, భారాస రాష్ట్ర నాయకుడు డా.ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌లు శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వి.కిశోర్‌బాబు మాట్లాడుతూ లారీల కిరాయి పెంచాలనే డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నా మిల్లు స్పందించకుండా మొండి వైఖరిని ప్రదర్శిస్తోందని ఆరోపించారు. మిల్లుపై, లారీలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలు జీవిస్తున్నందున మిల్లు యజమాన్యం, లారీ అసోసియేషన్‌ల మధ్య పట్టువిడుపులు ఉండాలని మాజీ ఎమ్మెల్యే కోనప్ప సూచించారు


లారీ అసోసియేషన్ సభ్యుల ఆందోళనకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే కోనప్ప


ఉపాధి కూలీలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు

కౌటాల, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్రం నిధులు కేటాయిస్తోందని, వాటిని దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రఘునాథ్, నాగరాజ్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కనికి, తలోడి, వీరవెల్లి గ్రామాల్లో ఉపాధిహామీ, ఐకేపీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి పని ప్రదేశాల్లో వసతుల కల్పన, కూలీల డబ్బుల చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ కోట ప్రసాద్, ఏపీఎం ముక్తేశ్వర్, ఈసీ సంతోష్ తదితరులున్నారు.

రూ.పది నాణెం చెల్లుబాటుపై అవగాహన

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: రూ.10 నాణేలు చెల్లుబాటుపై ఉన్న అపోహలను తొలగించేందుకు ఆర్‌బీఐ చేస్తున్న ప్రయత్నంలో భాగంగా మంగళవారం కాగజ్‌నగర్‌లోని యూబీఐ శాఖ మేనేజర్ అంబరీశ్ పాండ్యా, సిబ్బంది పట్టణ దుకాణాల వ్యాపారులకు అవగాహన కల్పించారు. బ్యాంకు ప్రతినిధులు 10 రూపాయల నాణెం చట్టబద్ధతను వివరించారు. వీటిని నిరాకరించొద్దని స్పష్టం చేశారు. నిరాకరిస్తే చట్టప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు.



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ అంబరీశ్ పాండ్యా

సంక్షిప్త సమాచారం

17న విద్యా సంస్థలకు సెలవు

ఆసిఫాబాద్: జోడేఘాట్‌లో ఈ నెల 17న కుమురంభీం వర్ధంతి పురస్కరించుకొని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు గమనించాలన్నారు. దీనికి బదులుగా నవంబర్ 9న రెండో శనివారం పనిదినంగా పాటించాలని ఆదేశించారు.

డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

ఆసిఫాబాద్ అర్బన్: ప్రభుత్వం రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్ చేపడుతుండగా.. జిల్లాలోని కళాశాలలు కూడా పాటించాయి. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధి సాయిని రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం రెండేళ్లుగా విడుదల చేయక పోవడంతో కళాశాలలను నడిపించడం భారంగా మారిందన్నారు. సిబ్బంది వేతనాలు, నిర్వహణ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బకాయిలు విడుదల చేసేవరకు బంద్ కొనసాగిస్తామని ప్రకటించారు.

కరెంటు లేక కష్టాలు

దహెగాం: మండలంలో గిరవెల్లి పంచాయతీ పరిధిలోని మెత్తె గ్రామంలో ఎనిమిది రోజులుగా విద్యుత్తు లేక కష్టాలు తప్పడం లేదు. నియంత్రిక చెడిపోవడంతో సంబంధిత అధికారులు రెండురోజుల్లో అమర్చినా.. సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో ఓవర్‌లోడ్ కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని అధికారులు స్పందించి మరో నియంత్రిక ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

షెడ్లు తొలగించొద్దని వినతి

బెజ్జూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియాలో షెడ్లు వేసుకుని ఏళ్ల తరబడి కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, వాటిని తొలగించొద్దని కోరుతూ.. వ్యాపారులు, నాయకులు మంగళవారం కార్యదర్శి తుకారాంకు వినతిపత్రం సమర్పించారు. తొలగించాలని పంచాయతీ అధికారులు నోటీసులు ఇవ్వడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు.

గమ్యం యాప్‌పై అవగాహన

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : గమ్యం యాప్‌తో బస్సు వివరాలను సులువుగా తెలుసుకోవచ్చని ఏడీసీ జె.శంకర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణికులకు దీనిపై అవగాహన కల్పించారు. ఆండ్రాయిడ్ చరవాణి కలిగిన వారు ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. దీనిలో బస్సు నంబర్ నమోదు చేయగానే అది ఏ ప్రాంతంలో ఉందన్న విషయం తెలుస్తుందని వివరించారు. ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీసీ సేఫ్టీ వార్డెన్ పోచం, ప్రయాణికులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆసిఫాబాద్: జిల్లాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. మంగళవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు ఫిర్యాదు చేసినట్లు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, వైద్య కళాశాల నుంచి జారీ అయిన ఉద్యోగ ప్రకటనలతో కొందరు దళారులు డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఒప్పంద, పొరుగు సేవల విధానంలో ఏజెన్సీలు జారీ చేసిన నోటిఫికేషన్‌ల ద్వారా చేపట్టిన నియామకాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

పెసా చట్టం ప్రకారం కమిటీల ఏర్పాటు

ఆసిఫాబాద్, కెరమెరి: ఏజెన్సీలో పెసా చట్టం ద్వారా పెసా కమిటీ గిరిజన మహిళ సంఘాలు, పంచాయతీ సర్పంచి/ప్రత్యేక అధికారితో కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్తు జిల్లా అధ్యక్షుడు మనోహర్, పెసా కమిటీ కెరమెరి మండల అధ్యక్షుడు మడావి భరత్ భూషన్ కోరారు. ఇందిరమ్మ కమిటీల ఎంపిక కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవోను నిలిపివేయాలన్నారు. 1970 తరువాత ఏజెన్సీ ప్రాంతాలకు వలస వచ్చిన గిరిజనేతరులను ఇందిరమ్మ లబ్ధిదారులుగా ఎంపిక చేయొద్దని కోరారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్తు జిల్లా అధ్యక్షుడు భగవంత్‌రావు, ప్రధాన కార్యదర్శి మారుతి, సహ కార్యదర్శి గణపతిలతో కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు.

జరిమానాతో ఫీజు చెల్లింపు గడువు పెంపు

కాగజ్‌నగర్ గ్రామీణం: కాగజ్‌నగర్‌లోని బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సెమిస్టర్-2 పరీక్ష ఫీజును రూ.1,000 జరిమానాతో ఈ నెల 20వ తేదీ వరకు చెల్లించడానికి అనుమతి ఇచ్చిందని కో-ఆర్డినేటర్ తూడురు దత్తత్రేయ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సందేహాలకు చరవాణి నం.73829 29651, 94943 14314, 98663 98678లలో సంప్రదించాలని సూచించారు.

క్రికెట్ పోటీల విజేత దహెగాం జట్టు

దహెగాం, న్యూస్‌టుడే : మండలంలోని ఖర్జీ గ్రామంలో దసరా పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఫైనల్‌లో దహెగాం, కన్నెపల్లి మండల జట్లు తలపడగా దహెగాం జట్టు విజయం సాధించింది. గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు అందించడంతో పాటు జ్ఞాపికలను ఎస్సై కందూరి రాజు అందజేశారు.



ప్రథమ బహుమతి అందుకున్న దహెగాం జట్టుతో ఎస్సై రాజు

ట్రాన్స్‌కో ఉద్యోగులకు సన్మానం

బెజ్జూరు, న్యూస్‌టుడే : బెజ్జూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ కె.రాజేశం, లైన్ ఇన్‌స్పెక్టర్లు గంట అశోక్, ఎస్.రాజులను ట్రాన్స్‌కో సిబ్బంది మంగళవారం సన్మానించారు. ఏఈ అంజన్‌కుమార్, సబ్‌ఇంజినీర్ అజయ్, లైన్‌మెన్లు బాలాజీ, ఉమాశంకర్, సంజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల: కౌటాల మండలంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ట్రాన్స్‌కో అధికారులు ఏడీఈ రాజేశ్వర్, ఏఈ రవీందర్, ఫోర్‌మెన్ రమేష్, లైన్‌మెన్లు చరణ్‌దాస్, గణపతిలను సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఆ శాఖ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు ఇచ్చి వారు చేసిన సేవలను కొనియాడారు. బెజ్జూరు సబ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, కౌటాల లైన్‌మెన్లు మాధవ్, ప్రవీణ్, లక్ష్మణ్, సత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


బెజ్జూరులో.. ఉద్యోగులను సన్మానిస్తున్న ఏఈ అంజన్‌కుమార్, సిబ్బంది